

# కథలోంచి కథ
## -కె.వరలక్ష్మి



## 'జీవరాగం' - కథానేపథ్యం

**హైస్కూల్లో తొమ్మిదో** తరగతి నుంచి స్కూల్‌ఫైల్ (11thక్లాస్) వరకు నా క్లాస్‌మేట్ మూర్తి. మాకు దూరపు బంధువులు కూడా. వాళ్ళ తల్లిగారు నాకు పిన్ని వరసౌతుంది. తర్వాత కాలంలో మూర్తి ఎం.ఏ చేసి పోలీసు ఆఫీసరయ్యాడు. ఉద్యోగరీత్యా ఎక్కడో దూరంలో ఉండేవాడు. 1990లో హఠాత్తుగా అతని నుంచి ఓ ఉత్తరం వచ్చింది. ఈ కథలోని ఉత్తరం యధాతథంగా అతను రాసిందే నేను పలకరించడానికెళ్ళేసరికి పెళ్ళైతే జరగడం లేదుకాని, ఏదో పార్టీ జరుగుతోంది. నిజానికిది కథకాదు. అలాగే జరిగిన ఒక సంఘటన.

ఉరుకుల పరుగుల జీవితాల్లో కన్నతల్లిని గురించిన ఆర్ద్రతనైనా ఎవరూ ఎక్కువకాలం నిలుపుకోలేరేమో అనిపించి ఈ కథ రాసాను. ఈ కథకు నేను 'స్మశాన వైరాగ్యం' అని పేరు పెట్టి పంపిస్తే పత్రికవాళ్ళు కథకు ఏ మాత్రం అతకని పేరొకటి పెట్టి ప్రచురించారు.

జీవితాల్లోని స్వార్థాల మధ్య మనసు మారుమూలల్లో ఎక్కడో దాగిన దుఃఖపు పొరలు ఏ చిన్ననాటి నేస్తాలకో చెప్పుకోవాలనిపిస్తుది కాబోలు. అది క్షణికమే అయినా మనిషిలోని మానవత్వానికి ఒక చిహ్నం, కాని, బిజీ పేరుతో కన్నతల్లిని మరచిపోవడం, దూరంగా పెట్టడం క్షమించరాని నేరం. మనిషి పోయాక ఎంత వగ ప్రదర్శించినా అదంతా నటనేమో అన్పించకమానదు.

## 'జీవరాగం'

**ఏమైందో తెలీదు.** చాలా సేపట్నుంచి ట్రెయిన్ ఆగిపోయిది. చదువుతున్న నవల్ని విసుగ్గా పక్కన పెట్టి కిటికీలోంచి బైటికి చూశాను. దూరపు కొండలు మునుపుదేరి కనిపిస్తున్నాయి. ఆతృత పట్టలేని కొందరు ట్రెయిన్ దిగి అటూ ఇటూ తిరుగుతున్నారు. బోర్‌గా అనిపించి, ఏం తోచక పర్స్ తెరిచి చూశాను. ఈ ప్రయాణానికి కారణమైన ఆ ఉత్తరం మళ్ళీ చేతికి తగిలింది.

***డియర్ శృతీ!***

నీకు ఉత్తరం రాసి, చాలారోజులైపోయింది కదూ! పది రోజుల క్రితం కండొలెన్స్ చెబుతూ నీ ఉత్తరం వచ్చేసరికి నేను మనుషుల్లో లేను. చాలా సివియర్‌గా వచ్చిన హార్ట్ ఎటాక్‌తో అపోలోలో ఉన్నాను. నిన్న ఇంటికి వస్తూనే నా టేబుల్ మీదున్న నీ ఉత్తరం చూడగానే ఏ ఆధారం లేకుండా నదిలో కొట్టుకుపోతున్న వాడికి పడవ అంచు దొరికినంత రిలీఫ్ ఫీలయ్యాను.

ఎప్పుడూ లేనిది మూర్తి ఇలా ఎందుకు రాస్తున్నాడా అనుకుంటున్నావు కదూ! నలభై దాటిన ఈ మిడిలేజ్ ఎంత చెడ్డదో నాకిప్పుడిప్పుడే అర్థం అవుతోంది. చాలా విషయాలు సమస్యలుగా మారిపోయి బాధిస్తున్నాయి. ఎవరితోనైనా చెప్పుకోవాలంటే

